
కథ

# ముత్యం - పగడం

గోపీకృష్ణ పుట్టగంటి



“ఈ సారి ఏన్యువల్ కాన్ఫరెన్స్ గోవాలో పెడుతున్నారంటగా..” కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి, ఆ మాటలు అంటుంటే మధుకర్‌కి.

“నీ కెందుకు అంత ఆనందం. నువ్వు రావుగా..” అన్నాను నేను. నాకు తెలిసినంత వరకూ గ్రూప్ హెడ్స్ మాత్రమే పాల్గొంటారు ఏన్యువల్ కాన్ఫరెన్స్‌లో.

“నేనయితే ఏమిటి, నువ్వయితే ఏమిటి? అక్కడేదో “కాజూఫెనీ” అని నేటివ్ డ్రింక్ దొరుకుతుందంట. ఒక బాటిల్ తెచ్చి పెట్టరా, వచ్చేటప్పుడు”

“తెచ్చి పెడతాను కానీ, నీకు మన ఎమ్‌డీ గారి కండిషన్ తెలుసు కదా. నాకేమయినా సహాయం చెయ్యరాదూ..”

“ఏడిసినట్లుంది. కథలూ, కాకరకాయలూ రాసే నీకు, నేను సాయం చెయ్యటం ఏమిటి..? సరేగాని ఈ సారి థీమ్ ఏమిటట?”

## Story

''ప్రేమ.. లవ్''

''అబ్బో.. నీకిష్టమయిన సబ్జక్ట్ కదా! నా సాయం అక్కర లేదులే! సరే కానీ బాసూ..మన ఎమ్‌డీ కుమారస్వామి గారేంటి ఈ మధ్య మరీ కుర్రాడయి పోతున్నాడు.. అంత కోపంగా చూడన క్కర లేదులే కానీ, నా ప్రసాదం నాకు రాకపోతే మాత్రం ఊరుకునేది లేదు'' బెదిరిస్తూ వెళ్ళిపో యాడు మధుకర్.

కుమారస్వామి గారు ఎమ్‌డీగా వచ్చిన తర్వాత, మా కంపెనీలో అనేక మార్పులు జరిగాయి. ప్రాఫిట్ గ్రాఫ్ పైపైకి పోయేకొద్దీ, స్టాఫ్ జీతభత్యాలు అడగ కుండానే పెంచారు. పనిని ఆస్వాదించే వాతావ రణం కల్పించారు. అందులో భాగమే ఈసారి కంపెనీ ఏన్యువల్ కాన్ఫరెన్స్ రొటీన్‌గా హెడ్డాఫీసు నాలుగు గోడల మధ్య కాకుండా గోవాలో ఏర్పాటు చేసారు. కాకపోతే ఆయన విధించే ఒక షరతే చాలా మందికి మింగుడు పడదు. కాన్ఫరెన్స్‌కి అటెండ్ అయిన ప్రతి ఒక్కరూ, ఆయనిచ్చిన థీమ్ మీద కనీసం అయిదు నిమిషాలన్నా మాట్లాడాలి. కల్పిత మయినా, స్వానుభవమయినా ఫర్వాలేదు. ఈ సారి ఆయనిచ్చిన థీమ్.. ప్రేమ.

***

''ఏమయ్యా కుమార్.. ఇప్పుడన్నా మొదలు పెడతావా... ఇంకా బతిమాలించుకుం టావా?'' మా ఎమ్‌డీ కుమారస్వామి గారి గొంతు ఖంగుమంటు వినిపించింది.


రాత్రి పన్నెండవుతూంది. కనిపించని శృంఖ లాల్ని వదిలించుకోవటానికి పెనుగులాడుతున్న ట్లుంది సముద్రం. చల్లని చేతుల్తో సముదాయిస్తు న్నట్లు, చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు. ఎదురుగా మేము దిగిన హోటల్ ఆహ్వానిస్తున్నట్లు కనిపిస్తూంది. నిద్రమత్తుకి మందుమత్తు తోడయి, అందరూ నా వంక దీనంగా చూస్తున్నారు – తొందరగా అవగొట్ట వయ్యా మగడా.. పోయి పడుకోవాలన్నట్లు.

మొక్కుబడిగా కొందరూ, మొహమాటంగా కొందరూ, అందరూ చెప్పటం ముగించారు. నేను తప్ప పుస్తకాల్లో చదివిన కొటేషన్స్ కొందరు చెప్తే, తమ తమ ప్రేమ కథలే కొందరు చెప్పారు. మా సేల్స్ హెడ్ అయితే దేవదాసు కథ చెప్పబో యాడు. మొత్తానికి మా కుమారస్వామి గారికి మాత్రం ఏమీ నచ్చలేదని అర్థమయిపోతుంది.

''ఇది ముత్యం కథ. ముత్యం భార్య కథ. మరి దీన్ని ప్రేమ కథ అనవచ్చో, లేదో విన్నాక మీరే చెప్పండి.'' అంటూ ప్రారంభించాను.

మా అమ్మమ్మ గారి ఊరు తెనాలి దగ్గర్లోని ఒక పల్లెటూరు. నేను చిన్నప్పుడు సెలవలు వచ్చినపు డల్లా అక్కడికే వెళ్ళే వాడ్ని. మా కజిన్స్ మొత్తం పది మంది దాకా చేరేవాళ్ళు నాలాగే సెలవలకి వచ్చి.

అమ్మమ్మ వాళ్ళింట పక్కనే ఉండేది ముత్యం వాళ్ళిళ్ళు. ముత్యం పూర్తి పేరు ఏమిటో ఎవరికీ తెలవదు. ఇప్పుడాలోచిస్తుంటే బహుశా ఏ ముత్యా ల్రాజో, ముత్యాలయ్యో అయ్యుంటుందనిపిస్తుంది. ఊర్లో అందరికీ అతను ముత్యమే. చిన్న పిల్లల



యినా, పెద్ద వారయినా అందరూ ముత్యమనే పిలిచేవారు. వాళ్ళావిడ పేరు – ముత్యం వాళ్ళ ఆవిడ.. అంతే!

ముత్యం వాళ్ళ ఆవిడ చిన్న చిల్లర కొట్టు నడుపుతూ ఉండేది. ఆవిడది కాస్త భారీ కాయం. మాట చాలా పెలుసుగా ఉండేది. ఎప్పుడూ చిల్లరకొట్లో ఒక స్టూలు మీద కూర్చుని ఉండేది. వక్క నమలడంతో పళ్ళన్నీ గార పట్టి ఉండేవి. ఆవిడ కొట్టు కెళ్ళాలంటే పిల్లలందరికీ భయమే! ఎవరూ వెళ్ళే వాళ్ళు కాదు. అదీకాక ఆవిడ కూర్చుంటే లెగవలేదు, లెగిస్తే కూర్చో లేదు. అందుకని వచ్చిన చిన్న పిల్లల చేత, కొద్దిగా అది అందుకో.. ఇది అందించు అని చిన్న చిన్న పనులు చేయించుకునేది. ఎప్పుడన్నా మా అమ్మమ్మకి ఏమన్నా అవసరం అయితే, ఆ డ్యూటీ పిల్లల్లో చిన్నవాడినయిన నా మీద పడేది. ఆ విధంగా, ముత్యం, వాళ్ళ ఆవిడ నాకు పరిచయమయ్యారు.

మొదటిసారి ఆ కొట్టు దగ్గరికెళ్ళినపుడు, ''ఎవరి అబ్బాయివిరా నువ్వు''? అని అడిగింది. ఆ అడగ టంలో ఏ మాత్రం మార్దవం లేక పోగా, పట్నంలో పెరుగుతున్న నాకు కాస్త అవమానంగా కూడా తోచింది. తరువాత అదే మాట మా అమ్మమ్మతో అంటే, నవ్వేసి– ''మాటేరా నాన్నా పెలుసు, మనసు చాలా మంచిది'', అనేది. ఏది ఏమైనా నాకు మాత్రం ముత్యం కొట్టుకి వెళ్ళక తప్పేది కాదు.

తరువాత్తరవాత నేను కూడా ఆవిడకి, ఆవిడ మాట తీరుకి అలవాటు పడిపోయాను. రోజులు గడిచే కొద్దీ, మా కజిన్స్ అందరూ పెద్దవారయి కాలేజీలలో చేరటంతో, సెలవులకి అమ్మమ్మ గారి వూరు రావటం తగ్గిపోయింది. నేను వెళ్ళినా నాకేమీ తోచేది కాదు. ఒకసారి ఏదో పనిమీద ముత్యం కొట్టుకి వెళ్ళినపుడు, ''ఒరే.. అబ్బాయ్.. కాస్త ఆ పంచదార గోతాంలోనుంచి ఒక కిలో ఈ డబ్బాలో తెచ్చి పెట్టరా..'' అంది. పంచదార తేవటం, కాటాలో పెట్టి తూకం వెయ్యటం, పొట్లాం కట్టటం కొత్తగా అనిపించినయ్. మా అమ్మమ్మ అడిగిన వస్తువులు ఇచ్చి మరలా వచ్చాను కొట్టుదగ్గరికి. అప్పటినుండి నేను ఆ ఊర్లో ఉన్నన్ని రోజులూ, ముత్యం వాళ్ళ ఆవిడకి పార్ట్ టైం హెల్పర్ నయ్యాను.

ముత్యం సరిగ్గా వాళ్ళావిడకి కాంట్రాస్ట్‌గా ఉండే వాడు. సన్నగా, ఒంట్లో స్ఫూను కండ కూడా లేనట్లు ఉండేవాడు. నోట్లో నుండి మాట వచ్చేది కాదు. చిన్న పిల్లలయితే పందాలు వేసుకుని ముత్యం చేత మాట్లాడించాలని, వెంటబడి ఏడిపించేవారు. తన

యితే ముత్యాన్ని ఏమయినా అనేది కానీ, ఎవరన్నా ఎగతాళిగా మాట్లాడితే మాత్రం వూరుకునేది కాదు. ''ఏయ్.. సచ్చినాళ్లారా... మీ సొమ్మేమన్నా పెడతన్నారా? మీ ఆస్తులేమన్నా కావాలన్నాడా? ఆయనతో మీకేమి పనిరా..'' అని తరిమేది.

ఎవరేమన్నా ముత్యం పట్టించుకునే వాడు కాదు. ఉదయాన్నే లేచి, చావిట్లో గొడ్లకి మేత వెయ్యటం, పాలు పిండటం చేసి, పాలు తీసుకెళ్ళి కేంద్రంలో పోసి వచ్చి, కొట్టు ముందంతా శుభ్రం చేసి, రాత్రి లోపల పెట్టిన సామానంతా బయట సర్ది వ్యాపారానికి తయారు చేసేవాడు. తరువాత నాగేశ్వరరావు కాఫీ హోటల్‌కి వెళ్ళి, రెండు ఇడ్లీ తిని, ఒక కాఫీ తాగి, వాళ్ళావిడకి పార్శిల్ కట్టించుకుని, ఒక గ్లాసులో కాఫీ పోయించుకుని వచ్చేవాడు.

''ఏంటి మామా, మీ పాలన్నీ కేంద్రానికి పోసి, మీరు మాత్రం నీళ్ళ కాఫీ తాగుతున్నారు?'' అనే వాడిని నేను. నవ్వేసి ఊరుకునేవాడు తప్పితే, మాట్లాడింది లేదు ఎప్పటి లాగే!

ఎక్కడినుంచి విందో వాళ్ళావిడ మాత్రం కంచు కంఠంతో అందుకుంది– ''ఆ.. అదొక్కటే తక్కువయింది అయ్యగారికి. సంపాదించిన జమీలన్నీ మురిగిపోతున్నయనా, కొత్త కొత్త అలవాట్లు కావాల్సి వస్తున్నయ్...? ఉరేయ్ నువ్వేంట్రా లేని పోని అలవాట్లు నేర్పుతున్నావు? అంటూ ..

ఇద్దరం మళ్ళీ మాట్లాడింది లేదు.

పనులన్నీ అయినాక, నులక మంచం వాల్చుకుని ఇంటి ముందు పడుకుని, చుట్ట వెలిగించేవాడు. అప్పటికల్లా వాళ్ళావిడ తయారయి వచ్చి కొట్లో కూర్చునేది. భారీకాయం వలన ఎక్కువ మొబిలిటీ ఉండేది కాదు. ఎక్కువ మంది మనుషులు వస్తే, నా లాంటి వాడు ఎవడన్నా దొరికితే వాడ్ని అడ్డం పెట్టుకుని పని జరిపించేదితప్ప, ముత్యాన్ని మాత్రం పిలిచేది కాదు. అదేమంటే, ''ఆ మనిషికి అంత తెలివే వుంటే నేనిట్లా ఎందుకుంటాను. ఒకటికి నాలుగు చేస్తాడు వద్దులే'' అనేది.

ముత్యం మాత్రం చుట్ట మేఘాలు సృష్టిస్తూ ఏ మాత్రం పట్టనట్లు ఉండేవాడు.

ఒకసారి మా అమ్మమ్మని అడిగాను, ''ఎందుకమ్మమ్మా అత్త అంత కటువుగా మాట్లాడుతుంది?'' అని.

''చాలా కష్ట పడిందిరా నాయనా చిన్నప్పటి నుంచి. దాని అత్త, మామలు పోయేదాకా కాల్చుకు తిన్నారు, దీనికి పిల్లలు లేరని, మొగుడి కేమో నోట్లో నాలుక లేదు. నోరు పెట్టుకు లాక్కు వచ్చింది సంసారాన్ని ఆ నోరే లేకపోతే దాన్ని ఈ ఊర్లో బతకనిచ్చేవారా..'' అంది. పూర్తిగా ఆ మాటల అర్థం బోధపడక పోయినా, అంతకుమించి రెట్టించలేదు నేను.

వారానికొకసారి కొట్లో ఏమేమి సామాను కావాలో ఒక చీటీ రాయించి ముత్యానికిచ్చి తెనాలి పంపేది. డబ్బులు మాత్రం బస్సు ఛార్జీలు కాక మరొక పది రూపాయలిచ్చేది. ముత్యం డ్యూటీ అల్లా, ఆ చీటీ తెనాలి తీసుకెళ్ళి, హోల్‌సేల్ కొట్లో ఇచ్చి, వాళ్ళిచ్చిన సామాను జాగ్రత్తగా తేవటమే. నెలకొకసారి వాళ్ళే వచ్చి డబ్బులు పట్టుకుపోయేవారు.

సామాను తెచ్చిన రోజు రాత్రికి ముత్యం ఇంటి ముందు సీన్ చూడాల్సిందే! కందిపప్పులో పుచ్చులున్నాయనేది. పంచదార పిండిలాగా ఉన్నాదనేది. వేరుశెనగ పప్పులో పురుగులు ఉన్నాయనేది. ఏ పనీ సరిగ్గా చెయ్యటం చేతకాదని ముత్యం మీద విరుచుకు పడేది. తరువాత మా అమ్మమ్మ చెప్పింది దాంట్లో మతలబు – ''ఆవిడే అన్ని మాటలన్నాక, ఇంక రేపు ఊర్లో వాళ్ళు ఏమంటారురా.. ఏమన్నా అడిగితే, ఏమి చేస్తామమ్మా, నేనేమో వెళ్ళలేను, ముదనష్టపోడిని పంపితే ఇలా చేసుకొచ్చాడు అంటుంది.''

ముత్యం ఎప్పుడూ దగ్గుతూ, నీరసంగా ఉండే వాడు. అప్పుడప్పుడు కళ్ళు తిరుగుతున్నాయని పడుకునేవాడు. అంతలావున్నా, వాళ్ళావిడ మాత్రం, గుండ్రాయి లాగ ఏ అనారోగ్యం లేకుండా ఉండేది. ఎప్పుడన్నా మోకాలు నెప్పులని మాత్రం ఆపసోపాలు పడేది. ''డాక్టరుకి చూపించకోవచ్చు కదా!'' అంటే, ''రోగిష్టి దాని లాగా కనపడుతున్నానా ఏంటి? ఐనా ఒకసారి డాక్టరు దగ్గర కెళ్లామంటే, ఇక వెళ్తా ఉండాల్సిందే! మీ మామని చూడరాదూ..'' అనేది తప్ప, డాక్టరు దగ్గరకి మాత్రం వచ్చేది కాదు.

మొగుడు, పెళ్ళాం సామరస్యంగా మాట్లాడుకున్నట్లు నాకయితే ఎప్పుడూ కనపడ లేదుకానీ ఊర్లో థియేటర్లో సినిమా మారిందంటే చాలు, ఇద్దరు కలసి బయలు దేరే వారు. హాలు లోపల ఆడవారినీ, మగవారినీ వేరు చేస్తూ, చెక్క పార్టిషన్ ఉండేది. దానికిటు ఒకరు, అటు ఒకరు కూర్చునే వారు. ఒక్కసారి కూడా వాళ్ళు ఒక్కరే సినిమాకెళ్లింది ఎవరూ చూడలేదంటే నమ్మాలి మరి.

నేను చాలా సార్లు అడిగాను, ''అత్తా... అందరూ నిన్ను ముత్యం పెళ్ళాం అంటారే తప్ప.. నీ పేరు పెట్టి పిలవరేంటి?'' అని. ఏమీ సమాధానం చెప్పేది కాదు. రాను రాను నాకు ఆవిడ అసలు పేరు తెలుసుకోవాలనే కోరిక బలపడింది. మా అమ్మమ్మ, తాతయ్యలని అడిగి చూసాను. వారికి అసలావిడకి ఒక పేరు ఉండాలి అన్న స్పృహేలేనట్లుంది. ఇంకెవరిని అడిగినా, తమకు తెలవదంటే, తమకు తెలవదనేవారు.

ప్రతి సంవత్సరం వెళ్ళినప్పుడల్లా పట్టినపట్టు విడకుండా, ఆవిడ్నే అడుగుతుండేవాడ్ని. ప్రతీసారీ సమాధానం దాటేసిందే తప్ప ఎన్నడూ చెప్పలేదు.

''ఇంకెంతసేపు సాగ దీస్తావయ్యా.. ఈ ఆర్ట్ ఫిల్మ్ కథ. తొందరగా ముగించు.'' అసహనం పెరిగిపోతుంటే, మా కొలీగ్స్ కామెంట్ చేస్తున్నారు.


''నువ్వేదో కథల స్పెషలిస్టువి కదా అని, చివర్లో చెప్పమంటే... ఈసోదంతా ఏంటి?'' అనలేదు కానీ, కుమారస్వామి గారి ముఖకవళికలు అలాగే ఉన్నాయి.

''సారీ ఫ్రెండ్స్.. ఐపోయింది.. ఇంకొక ఐదు నిమిషాలంతే, కొద్దిగా ఓపిక పట్టండి.'' అని కంటిన్యూ చేసాను.

ముత్యం దంపతుల్ని తరువాత పదేళ్ళు కలవలేకపోయాను. నా చదువు, పెళ్ళి ఈ హడావుడిలో, మా అమ్మమ్మ గారి ఊరు వెళ్ళటం కుదరలేదు. ఒక వేళ వెళ్ళినా, వాళ్లని చూసే అవకాశం దొరకలేదు.

మొన్ననే మరలా వెళ్ళవలసి వచ్చింది ఆ ఊరు. మా అబ్బాయిని తీసుకుని వెళ్ళాను, వాడికి ఆ ఊరు చూపించాలని. మా అబ్బాయిని అమ్మమ్మ దగ్గర వదలి, ముత్యం కొట్టు కెళ్ళాను. ముత్యం మరింత నీరస పడి పోయాడు. వాళ్ళావిడ మరింత లావయింది. కొత్త కొత్త షాపులు వచ్చినట్టున్నయ్, వ్యాపారం బాగా తగ్గింది. అదీగాక అందరికీ టౌన్ కెళ్ళటం బాగా అలవాటు అయినట్లుంది, వీళ్ళ కొట్టు కొచ్చే వాళ్ళు బాగా తగ్గిపోయారు.

''ఏరా.. ఇన్నాళ్ళకు గుర్తుకొచ్చిందా, మీ అమ్మమ్మ.. చేయించుకోవటానికయితే కావాలి కానీ, ముసలాళ్ళయినాక చూడటానికి కూడా మీకు తీరికుండదు.'' అంటూ పలకరించింది, ముత్యం



వాళ్ళ ఆవిడ.

''ఏమి మారినా మా అత్త గొంతు మాత్రం మారలేదు.'' అన్నాను నేను.

నవ్వేసింది.

కాసేపు మాటలయినాక అడిగాను – ''అత్తా.. ఎన్నిసార్లడిగినా చెప్పలేదు.. నీ పేరేంటో.. ఇప్పుడన్నా చెప్పవా?''

దగ్గుతూ, చుట్ట తాగుతున్న ముత్యం కూడా, కొద్దిగా కుతూహలంతో తలెత్తి చూసాడు, ఏమి సమాధానం చెప్తుందో అన్నట్లు.

''ఏంటిరోయ్... నాపేరు మీద పట్టిచ్చావే? ఏ పేరయితే ఏంటంట'' అంది.

''అదికాదులే అత్తా.. నాకు చిన్నప్పటినుంచి ఈ కోరిక మిగిలి పోయింది, నీ పేరు తెలుసుకోవాలని. ఈ సారన్నా చెప్పకపోతే, ఇంకెప్పుడూ మీ దగ్గరకి రాను'' అన్నాను.

ఇంతకుముందు కూడా ఇలా చాలా సార్లు బెదిరించాను. ఐనా ఆమె ఎప్పుడూ లొంగలేదు. ఈ సారి మాత్రం, బహుశా వయసు ప్రభావమేమో, నెమ్మదిగా చెప్పింది, ''నిజంగారా అబ్బాయ్... నా పేరేంటో, నాకే తెలవదు. నా పన్నెండో ఏట పెళ్ళయి ఈ ఊరు వచ్చాను. అందరూ నన్ను ''సూరయ్య కూతురు'' అని పిలవటమే గుర్తుంది. పెళ్ళయినాక ముత్యం పెళ్ళాన్నయినాను, నా పేరేంటో గుర్తూ లేదు, దాని అవసరమూ రాలేదు. ఓట్లు రాసుకునే వాళ్ళు, రేషన్ కార్డుల వాళ్ళు కూడా, నా పేరు ముత్యం పెళ్ళాం అనే రాసుకుపోయారు.

''వాళ్ళందరూ సరేలే అత్తా, మా మామ ఐనా నీకు ఏదో ఒక పేరు పెట్టలేదా? అదన్నా చెప్పవచ్చు కదా!'' ఎగతాళిగా అడిగాను, వెంటనే జరగబోయే దేంటో నాకు తెలుసు, ఏదో వంక పెట్టుకుని ఆయన మీద పడిపోతుంది. అందుకే ఆయన ప్రస్తావన తెచ్చాను.

ఈసారి మాత్రం ఆవిడ అలా ప్రవర్తించలేదు. కూడబలుక్కున్నట్లు చెప్పింది, ''మీ మామ ఏమి పేరు పెట్టాడో, మీ మామనే అడుగు..'' అని.

ఒక్కసారిగా నాకు క్లూ దొరికినట్లయింది. నోట్లో నాలుక లేనట్టుండే, మా ముత్యం మామ దగ్గర ఇన్ని సరసాలున్నాయా అనుకుని, మామ వేపు తిరిగాను. ''మామా.. మామా.. చెప్పు మామా.. అత్తకేదో పేరు పెట్టావంటగా.. చెప్పు మామా..''

ఒరే.. పోరా.. అన్నట్లు ఒక చూపు చూసి, నెమ్మదిగా మంచంలోంచి లేసి బయలుదేరాడు.

''మీ మామ తెనాలి పోయి రావాలి.. సామానుకి..'' అంది అత్త.

నేను వదిలిపెట్టలేదు, ''మామా... మామా.. ఒక్కసారి అత్తని పేరు పెట్టి పిలువు మామా..'' అని వెంట పడ్డాను.

పట్టించుకోనట్లే సాగిపోయాడు. నేను వదలకుండా వెంట పడ్డాను. చివరికి గొనుగుతున్నట్లు అన్నాడు ''మీ అత్త పేరులో దోషముంది. పేరు పెట్టి పిలిస్తే చచ్చి పోతుంది. ఎక్కువ మాట్లాడితే మాటల మధ్య పొరపాటున ఎప్పుడో ఒకసారి పేరు పెట్టి పిలుస్తానేమో అని, మాటలే తగ్గించాను.''

''ఎవరు చెప్పారు మామా? ఈ రోజుల్లో కూడా ఇలాంటి నమ్మకాలు ఏమిటి? ఎవరన్నా వింటే నవ్వుతారు. అయినా నేనేమీ అత్తని పేరు పెట్టి పిలవనులే, ఎవరికీ చెప్పను కూడా. చెప్పు మామా..'' చేతిమీద చెయ్యివేసి బతిమాలాను.

నా వేలికున్న పగడపు ఉంగరం నల్లటి ముత్యం ఒంటి మీద మెరుస్తూంది. సాలోచనగా నా ఒంక చూసాడు ముత్యం. ''దాని పేరు చెప్తే ఏమన్నా అవుద్దో, లేదో నాకు తెలవదు.. కానీ దానికేదన్నా అయితే..'' ఒక క్షణం ఆగాడు. మరలా ఏమి ఆలోచించాడో కానీ ''దాని పేరు యిదే.. ఎవరికీ చెప్పమాక..'' అంటూ నా ఉంగరం వంక చూపించి చెప్పి, బస్‌స్టాండ్ వైపు వెళ్ళిపోయాడు.

కాసేపు అర్థం కాలేదు. ఉంగరం చూపించి దాని పేరు ఇదే అంటాడేమిటి? అని. కాసేపటికి వెలిగింది. అత్త పేరు ''పగడం''.. యస్... ఎంత బాగుంది. కానీ ఎవరికీ చెప్పొద్దన్నాడే! తెలిసి కూడా ఉపయోగమేమిటి? ఆలోచిస్తూ ఇంటికొస్తున్నాను.

''వాళ్ళందరూ సరేలే అత్తా, మా మామ ఐనా నీకు ఏదో ఒక పేరు పెట్టలేదా? అదన్నా చెప్పవచ్చు కదా!'' ఎగతాళిగా అడిగాను, వెంటనే జరగబోయేదేంటో నాకు తెలుసు, ఏదో వంక పెట్టుకుని ఆయన మీద పడిపోతుంది. అందుకే ఆయన ప్రస్తావన తెచ్చాను.
ఈసారి మాత్రం ఆవిడ అలా ప్రవర్తించలేదు. కూడబలుక్కున్నట్లు చెప్పింది, ''మీ మామ ఏమి పేరు పెట్టాడో, మీ మామనే అడుగు..'' అని.
ఒక్కసారిగా నాకు క్లూ దొరికినట్లయింది. నోట్లో నాలుక లేనట్టుండే, మా ముత్యం మామ దగ్గర ఇన్ని సరసాలున్నాయా అనుకుని, మామ వేపు తిరిగాను.

ముత్యం కొట్టు ముందు చాలా మంది గుమికూడి ఉన్నారు. నేను కూడా పరుగెత్తుకుంటూ వెళ్ళాను. స్టూల్ మీదనుండి పక్కకి ఒరిగి పోయి ఉంది, ముత్యం వాళ్ళ ఆవిడ. చూడగానే అర్థమవుతుంది, ప్రాణం పోయిందని. పక్కకి జరిపి పడుకోపెట్టాను. ఎమ్మార్పీ డాక్టరు ఒకాయన వచ్చి చూసి కన్ఫర్మ్ చేసాడు చనిపోయిందని. ఏ అనారోగ్యం లేని ఆవిడ అలా ఒక్కసారిగా పోవటం పెద్ద చర్చనీయాంశం అయింది.

ఇంతలో ముత్యం సంగతి గుర్తుకొచ్చింది. తెనాలి వెళ్ళి పోతాడేమో అని, నేనే బస్ స్టాండ్‌కి వెళ్ళాను. అప్పటికే ముత్యానికి ఈ సంగతి ఎవరో చెప్పినట్లున్నారు. పిడుగుపాటుకి గురయినట్లు కూలబడి పోయాడు.

ఎవరో తీసుకెళ్ళి చెట్టుకింద కూర్చోబెట్టారు. ఆయాసంతో ఒగరుస్తున్నాడు. మధ్య మధ్య దగ్గుతో ఊపిరాడటం లేదు.

''తట్టు కోవాలయ్యా ముత్యం, సముదాయించుకో.. పోదాం పద, మిగిలిన కార్యక్రమం చూడాలి, మళ్ళీ పొద్దు పోతుంది.'' ఎవరో పెద్ద మనిషి జరగాల్సింది సూచిస్తున్నాడు.

నేను రానన్నట్లు తల అడ్డంగా ఊపుతూ, లేప బోయిన వారిని ప్రతిఘటిస్తున్నాడు. దగ్గు, ఆయాసం మధ్య ఏదో మాట్లాడుతున్నాడు. ఏమీ అర్థం కావటం లేదు. ''నా మూలంగానే జరిగింది.. నేనే చేసాను..'' అన్నట్లు అనిపించింది నాకు. వెళ్ళి భుజం మీద చెయ్యి వేసాను ఓదార్చటానికన్నట్లు.

షాక్ కొట్టినట్లు ఒకసారి నా ఉంగరం చూసాడు. హఠాత్తుగా ఆయాసం ఎక్కువయింది. మనిషిలో ఉద్రేకం పెరిగి పోతూంది. ఏదో చెప్పబోతున్నాడు. నోట్లో నుంచి మాటలు రావటం లేదు. అస్పష్టంగా ''నేనే చంపాను'' అన్నట్లు వినిపిస్తుంది నాకు. అలా బాధ పడుతూనే, హాస్పిటల్‌కి తీసుకెళ్ళేలోపే పోయింది ప్రాణం.

***

సముద్రపు అలల ఉధృతం తగ్గి, తప తప కొట్టుకుంటున్నాయి. మబ్బులడ్డం వచ్చి వెన్నెల మసకేసింది. మ్లానమయిన మొహాలని దాచుకునే ప్రయత్నం చెయ్యటం లేదు, నా కొలీగ్స్. అప్పటిదాకా తొందర చేసిన వారెవరూ, హోటల్ రూమ్‌ల వైపు వెళ్ళే ప్రయత్నం కూడా చెయ్యటం లేదు.

''నిజంగా పేరు చెప్పటం వలనే చనిపోయిందంటావా?'' అడిగాడు ఆర్ట్ ఫిల్మ్ కథ అని కామెంట్ చేసిన వాడు.

''అలా అనుకుందామన్నా, పేరు చెప్పలేదుగా.. జస్ట్ సైగ చేసి చూపించాడు. నిజానికి అదే ఆమె పేరు అవునో కాదో కూడా నాకు తెలీదు. కేవలం నేను ఊహించి చెప్పాను ఆమె పేరు ''పగడం'' అని.

''మరి ఎట్లా చచ్చి పోయింది?'' భయంగా అడిగాడు. ''అయినా నిన్ను ప్రేమ కథ చెప్పమంటే, ఇట్లా భయపెట్టే కథ చెప్తావేంటి? సరిగ్గా చెప్పు... ఎందుకు చనిపోయింది?''

''మృత్యువుకి రీజన్ ఉండదు. ప్రేమకథలో భయం ఉండకూడదనీ లేదు.'' అంటూ లేచి వెళ్ళిపోయాను.

తరువాత చాలా రోజులు ఈ కథే చెప్పుకున్నారు. మా ఆఫీసులో.

కుమారస్వామి గారు మాత్రం ఇప్పటికీ అడుగుతూనే ఉన్నారు– ''నిజంగా అది నిజమేనా'' అని.

చిరునామా
పి. గోపీ కృష్ణ
**16-4-950 ఎ,**
ఈస్ట్ ఆఫ్ అపోలో హాస్పిటల్
పినాకిని ఎవెన్యూ, ముత్తుకూరు రోడ్,
నెల్లూరు – **524 003.**